నేటి నుంచి శిల్పారామంలో ఉగాది వసంతోత్సవాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నేటి నుంచి ఉగాది వసంతోత్సవాలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 1వ తేదీ వరకు జరుగుతాయని అధికారులు తెలిపారు. 29న మోతాలి పద్మప్రియ శిష్య బృందగానం, ప్రసన్న మోహన్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించనున్నారు. 30వ తేది ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడి సాగి కమలాకరశర్మచే పంచాంగ పఠనం, అపర్ణ ధూళిపాల శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన. 31వ తేదీ శీనయ్య శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన, ఏప్రిల్ 1వ తేది పరంజ్యోతి శిష్య బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన, శ్రీవల్లిరావు శిష్యబృందంచే కథక్ ప్రదర్శనలతో సందర్శకులను అలరించనున్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం



పదవీ విరమణ చేసిన వారిని సత్కరించిన కమాండెంట్ రామకృష్ణ

గచ్చిబౌలి: ఉద్యోగ విరమణ సాధారణమని కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ ఎం రామకృష్ణ పేర్కొన్నారు. కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో పదవీ విరమణ చేసిన యూవి సురేష్, ఎన్ ప్రతాప్‌రెడ్డి, హన్మంతురెడ్డిలను ఆయన శుక్రవారం ఘనంగా సత్కరించారు. అవసరమైన సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్ రాంబాబు, ఎం నాగభూషణం, జి జగదీశ్వర్, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి పాపిరెడ్డినగర్‌లో సీడబ్ల్యూసీ, హోలిస్టిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ తారక్ రోగులను పరీక్షించారు .నిత్యం వ్యాయామం తప్పనిసరిగా చేయాలని సూచించారు.

3న గెస్ట్ లెక్చరర్ల ఇంటర్వ్యూలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్లలోని తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో మ్యాథమెటిక్స్, బోటనీ సబ్జెక్టులకు అతిథి అధ్యాపకుల నియామకం చేపడుతున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, ఎన్‌ఈటీ, ఎస్‌ఈటి అర్హత కలిగి, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేరుగా ఏప్రిల్ 3 వ తేదీ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకి హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 6281279006, 9642286686 నంబర్లను సంప్రదించాలన్నారు.

హైడ్రా కమిషనర్‌ను కలిసిన దూబే కాలనీవాసులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని దూబే కాలనీలోని పది మీటర్ల రోడ్డును లింగంపల్లి రైల్వే స్టేషన్ రోడ్డుకు అనుసంధానం చేయాలని కోరుతూ ఆ కాలనీవాసులు హైడ్రా కమిషనర్‌ను శుక్రవారం కలిశారు. హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్‌ను సికింద్రాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. దూబేకాలనీలోని 111 సర్వే నంబర్‌లో 10 మీటర్ల దూరంలో ఉన్న రోడ్డుతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కొన్నిసార్లు రోడ్డు రద్దీగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. రైల్వే స్టేషన్ రోడ్డును తమ కాలనీ రోడ్డుకు అనుసంధానం చేస్తే ప్రయాణం సాఫీగా సాగేందుకు వీలుంటుందని వారు సూచిచారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే రోడ్డును పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసినవారిలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా 23 లక్షల 24 వేల రూపాయల చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరం అన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, చంద్రకాంత్‌రావు, పోతుల రాజేందర్, చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్ కావూరి, రాజు నాయక్, గణపతి, చంద్రమోహన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

'బడి బాగు' పడింది

సేవాదృక్పథంతో ముందుకొచ్చిన 'నిర్మాణ్' సంస్థ ● లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల కల్పన

శేరిలింగంపల్లి: 'నిర్మాణ్' సంస్థ, ఓపెన్ టెక్స్ సహకారం.. ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయుల చొరవతో శేరిలింగంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయి..

- ◆ లింగంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక డిజిటల్ బోర్డులను తాజాగా నిర్మాణ్ సంస్థ ఏర్పాటు చేయించింది.రూ.6 లక్షల వ్యయంతో 3, 4, 5 తరగతి గదులకు చెందిన విద్యార్థులకు ఆ డిజిటల్ బోర్డులు ఉపయుక్తంగా ఉన్నాయి.
- ◆ రూ.1 లక్ష వ్యయంతో రెండు ఆఫీస్ టేబుళ్లు, తరగతుల వారీగా 5 టేబుళ్లు, ఆఫీస్‌కు 18 చైర్స్, 7 అల్మారాలు కూడా అందజేశారు. స్పోర్ట్స్ మెటీరియల్ కూడా అందించారు.

సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు..

- ◆ లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో రూ.13 లక్షలతో ఒక క్లాస్ రూమ్, రూ.6.50 లక్షలతో మోడల్ టాయిలెట్స్ (బాలికలు, బాలురకు వేర్వేరుగా) నిర్మించారు.
- ◆ తరగతి గదులు, ఆఫీస్ రూమ్‌లకు ఎలక్ట్రికల్ వైరింగ్, 12 ఫ్యాన్లు, 12 ట్యూబ్ లైట్స్ అమర్చారు.
- ◆ ఏటా ఆటబొమ్మలు, బ్యాగులు, మంచినీటి బాటిళ్లు, లైబ్రరీ బుక్స్, జామెట్రీ బాక్స్ అందించారు.



లింగంపల్లి ప్రైమరీ స్కూల్

- ◆ పెయింటింగ్ పూర్తయిన తర్వాత స్కూల్ గోడలపై విద్యాపరమైన అంశాలతో పెయింటింగ్‌లు, కరికులమ్ రిలేటెడ్ పెయింటింగ్స్ వేయించారు.
- ◆ రూ. 5లక్షలతో ఆర్‌ఓ ప్లాంట్‌ను సైతం ఏర్పాటు చేశారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించారు.



తరగతి గదిలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డు

పాఠశాలలో పలు వసతులు అందుబాటులో..



నిర్మాణ్ సంస్థ, ఓపెన్ టెక్స్ లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడం సంతోషంగా ఉంది. సంస్థ ద్వారా క్లాస్ రూం, మోడల్ టాయిలెట్స్, డిజిటల్ బోర్డులు, ఆర్‌ఓ ప్లాంట్, ప్రహరీ ఇలా ఎన్నో వసతులు అందుబాటులోకి వచ్చాయి.
– బీ.సీ. భీమయ్య, ప్రధానోపాధ్యాయులు, లింగంపల్లి ప్రాథమిక పాఠశాల

బహుళ సంస్కృతిని కాపాడుకోవాలి

హెచ్‌సీయూ మానవీయశాస్త్రాల విభాగాధిపతి ఆచార్య అన్సారి

రాయదుర్గం: విభిన్న సంస్కృతుల కలయికతో భారతదేశం బహుళ సాంస్కృతిక కేంద్రంగా సాగుతోందని, దాన్ని ఉత్సవాల ద్వారా కాపాడుకోవాలని హెచ్‌సీయూ మానవీయ శాస్త్రాల విభాగాధిపతి ఆచార్య ఎం.టి. అన్సారి పేర్కొన్నారు. ఉగాది పండగను పురస్కరించుకొని హెచ్‌సీయూలో శుక్రవారం మానవీయ శాస్త్రాల విభాగం ఆడిటోరియంలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది ఉత్సవాల సందర్భంగా దేశ వ్యాప్తంగా వివిధ పేర్లతో జరిగే ఉగాది పండుగ విశేషాలను వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లల మర్రి రాములు మాట్లాడుతూ ఉగాది ప్రకృతికి సంబంధించినదని ప్రకృతి చిగుర్చినట్టుగానే మానవులలో కొత్త ఆలోచనలకు బీజం వేసే పండగగా అభివర్ణించారు. హెచ్‌సీయూ అధ్యాపక సంఘం అధ్యక్షుడు ఆచార్య బంగ్యాభూక్యా ,తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. కవిత వినిపించారు. తెలుగుశాఖ అధ్యాపకులు, ఆచార్యులు ఎం గోనానాయక్, డి విజయలక్ష్మి, పి వారిజారాణి, త్రివేణి, డాక్టర్ భూక్య తిరుపతి, డాక్టర్ బి భుజంగరెడ్డి, డాక్టర్ పి విజయ్‌కుమార్, డాక్టర్ బాశెట్టి లత, థియేటర్ ఆర్ట్స్ ఆచార్య అనురాధ, ఆంగ్లశాఖ అధ్యక్షుడు ఆచార్య ఎం మురళీమనోహర్, తులనాత్మక అధ్యయనశాఖ అధ్యక్షుడు ఆచార్య జే భీమయ్య, సంస్కృత శాఖ డా.వేదనిధి, విద్యార్థులు పాల్గొన్నారు.



హెచ్‌సీయూలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న ప్రొఫెసర్లు, అధ్యాపకులు

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి వారోత్సవాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసిన ప్రధానోపాధ్యాయులు

చందానగర్: శ్రీరామకృష్ణ పరమహంస గురుదేవుల జయంతి వారోత్సవాలను రామకృష్ణ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో మియాపూర్ ప్రగతి ఎన్‌క్లేవ్ కాలనీలో నిర్వహించారు. శేరిలింగంపల్లి మండలంలోని మియాపూర్, మక్తా మహబూబ్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు, ఉత్తిష్ఠ భారత బృందగానం పోటీలలో 72 మంది పాల్గొన్నారు.విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. అనంతరం వ్యక్తిత్వ వికాసంపై రామకృష్ణ మఠం ప్రచురణలు, నోటు బుక్స్, ఫైళ్ళు, పెన్నులు కలిగిన ఫెయిర్స్ ఫౌండేషన్ ప్రాయోజిత 72 కిట్లను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేందర్ రాజు, సహ అధ్యాపకులు, జేఎన్‌టీయూహెచ్ వరిష్ఠ ప్రాచార్యులు, సమితి కార్యదర్శి డాక్టర్ కె.చంద్రశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ్ జువెలర్స్ నూతన షోరూం ప్రారంభం

చందానగర్: చందానగర్ గంగారంలో కల్యాణ్ జువెలర్స్ నూతన షోరూమ్‌ను సినీహీరో అక్కినేని నాగార్జున, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కొత్త 425వ షోరూమ్‌లో అద్భుతమైన డిజైన్‌ల శ్రేణిని అందిస్తుందన్నారు. వీటిలో వివాహ ఆభరణాలు, యాంటిక్ ఆభరణాలు, టెంపుల్ జ్యువెలరీ మరెన్నో ప్రసిద్ధ బ్రాండ్‌లు ఉన్నాయన్నారు. రూ.10వేల ధరలతో ప్రారంభమయ్యే కాండెరీలోని ఆభరణాలు మంచి బహుమతిగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో కల్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కల్యాణరామన్, ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



గంగారంలో కల్యాణ్ జువెలరీ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీ హీరో అక్కినేని నాగార్జున

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి

సర్వేజనా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్.జనార్దన్‌రెడ్డి

రాయదుర్గం: ఉన్నతవిద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన అవసరమని సర్వేజనా ఫౌండేషన్ సీఈఓ, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ బి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. రోడ్ ట్రాఫిక్ రెగ్యులేషన్స్‌పై భారత ప్రభుత్వ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ శాఖ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని సుమారు 15 లక్షల విద్యాసంస్థల్లో 26 కోట్ల మంది విద్యార్థులు చదువుతున్నారని వీరందరికీ రోడ్డు భద్రతపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి మనుషులు తమ కుటుంబాలకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గురువారెడ్డి ఆధ్వర్యంలో సర్వేజనా ఫౌండేషన్ ఏర్పాటు చేశామని, గూగుల్ ప్లే స్టోర్‌లోని స్టాప్ రోడ్ యాక్సిడెంట్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే రోడ్డు భద్రతకు సంబంధించి 24 ప్రశ్నలు ఉంటాయని, వాటిల్లో సరైన సమాధానాలు రాసిన వారికి ప్రతి నెలా ఒక లక్ష రూపాయల నగదు బహుమతిని అందిస్తామన్నారు.



ఏప్రిల్ 19న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు స్కూల్, కళాశాల విద్యార్థులకు ఏప్రిల్ 19న ఎస్కీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా. రామేశ్వరరావు తెలిపారు.

సీతారాముల తలంబ్రాలు ఇంటివద్దకే ..

హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి

రాయదుర్గం: భద్రాచాలంలో జరిగే సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఇంటికి చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన డిపోలో కల్యాణ తలంబ్రాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ కార్గో సేవల ద్వారా హోమ్ డెలివరీ చేయాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. తలంబ్రాలు కావాల్సిన వారు రూ.151 చెల్లిస్తే కార్గో ద్వారా ఇంటికే చేరుస్తామని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి.వి.రెడ్డి ఫోన్ నంబర్ 9652267204, 9849567204లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇఫ్తార్ విందు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని సీనియర్ నాయకుడు సలావుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం 'దావత్ ఏ ఇఫ్తార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి, సోదరభావానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గణేష్‌ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, ఇమ్రాన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీని సత్కరించిన మైనార్టీ నాయకులు

పార్కును పరిరక్షించారు



నగరంలో ఖాళీ స్థలాలపై కబ్జాదారుల కన్ను పడుతోంది. ఈ క్రమంలో ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పార్కు స్థలాన్ని కాపాడారు. రూ.10 లక్షల నిధులతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. చందానగర్ డివిజన్ పరిధిలోని జవహర్ కాలనీలో సుమారు 1600 గజాల పార్కు స్థలంపై కొంతమంది కబ్జారాయుళ్ళ కన్నుపడింది. వెంటనే అప్రమత్తమైన కాలనీవాసులు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి అభివృద్ధి చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పార్కు స్థలాన్ని కాపాడారు. – చందానగర్

ఉగాది కవి సమ్మేళనం

చందానగర్: విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని చందానగర్‌లోని శ్రీ విశాఖ శారదా పీఠ పాలిత వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పాలకమండలి సహకారంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనంను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాస్య బ్రహ్మ, పాత్రికేయుడు డాక్టర్ శంకరనారాయణ, హెచ్‌సీయూ ఆచార్య బాశెట్టి లత, డాక్టర్ ములుగు అంజయ్య శతావధాని, చిత్రకవితా సామ్రాట్ చింతా రామకృష్ణారావు, సంచాలక చక్రవర్తి శ్రీ కటకం వెంకటరామశర్మ, ఆర్కిటిక్ యెండూరి సురేష్ బాబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వసంతఋతువు నిత్య నూతనానికి ప్రతీకన్నారు.



వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కవి సమ్మేళనం

అనంతరం అతిథులను, కవులను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు విజయలక్ష్మి, వాణి సాంబశివరావు, అమ్మయ్య చౌదరి, పాలం శ్రీను, జనార్దన్, జిల్ మల్లేష్, వెంకటేశ్వరరాజు, శివ రామకృష్ణ, జీవిరావు, సత్యనారాయణ, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

గురునాథం చెరువు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డీసీ మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

చందానగర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం, పటేల్, పెద్ద కుడి చెరువుల పునర్జీవనంలో భాగంగా చేపట్టిన పనులను మల్లిగవాడ్ ఫౌండేషన్ సభ్యులతో కలసి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, చందానగర్ ఉపకమిషనర్ మోహన్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీటి చెరువులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. చెరువుకట్ట చుట్టూ చెట్లు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామన్నారు. చెరువులోకి మురుగు నీరు రాకుండా కాల్వ నిర్మాణం, అలుగు మరమ్మతులు, చెరువుకట్ట బలోపేతం, వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ నిర్మిస్తామన్నారు. ఫౌండేషన్ సభ్యులు రామ్, చైతన్య, జీహెచ్‌ఎంసీ అధికారులు ఎస్‌సీ శంకర్, ఈఈ ఇంద్రబాయ్, ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, డీఈ దుర్గా ప్రసాద్, ఏఈ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు, ఈద్గాల పరిశీలన

గచ్చిబౌలి: రంజాన్ పండగను పురస్కరించుకుని ఇబ్బందులు తలెత్తకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్టు జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రంజాన పర్వదినాన్ని పురస్కరించుకొని మాదాపూర్‌లోని కాకతీయ హిల్స్ అలంగీర్ ఈద్గాను ఆయన అధికారుల బృందం, మసీద్ ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదు, ఈద్గాలలో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని, వీధిదీపాల ఏర్పాటు, గుంతలు పడ్డ రహదారులకు తక్షణం మరమ్మతులు చేయాలన్నారు. కాకతీయహిల్స్ రోడ్ నంబర్ 11 నుంచి శ్రావణి ఆస్పత్రి గుట్టల బేగంపేట వరకు అనుసంధాన రహదారి నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. అధికారులు పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాన్నారు. పెదకుడి కుంట, పటేల్‌చెరువు, కుడికుంటల పనులను ఆయన పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో డీసీ మోహన్‌రెడ్డి, ఏసీపీ నాగిరెడ్డి, డీఈ శ్రీదేవి, వైద్యాధికారి డాక్టర్ రవి, ఏఈ ప్రశాంత్, ఈద్గా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

చందానగర్: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2010 సంవత్సరంలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడైన ఖమ్మం జిల్లా కాసుమంచి మండలం పరికాసింగారం గ్రామానికి చెందిన చెల్ల నాగేశ్వర్‌కు జీవిత ఖైదు విధిస్తూ శుక్రవారం కూకట్‌పల్లి మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి పావని తీర్పు చెప్పారు. అలాగే రూ.5వేల జరిమానా విధించారు. మరో కేసులో ఇదే వ్యక్తికి...వరకట్న వేధింపు కేసుకు సంబంధించి మూడేళ్ల జైలు, రూ.1000 జరిమానా విధించినట్లు మియాపూర్ సీఐ క్రాంతి కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

వేసవి క్రీడలకు మైదానాలు సిద్ధం

చిన్నారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వేసవి క్రీడా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది మైదానాలు ముస్తాబవుతున్నాయి. విద్యార్థులకు వేసవి క్రీడా శిబిరాలు నూతన ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించగానే శిక్షణ తరగతులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

- ● పరీక్షలు ముగిసిన వెంటనే శిక్షణ ప్రారంభం
- ● క్రికెట్‌కు రూ.50, ఇతర క్రీడలకు రూ.10 నామినల్ ఫీజు



కేపీహెచ్‌బీకాలనీ: జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోన్ పరిధిలోని మూసాపేట సర్కిల్ కేపీహెచ్‌బీకాలనీ డివిజన్‌లో క్రీడా మైదానాలు దాదాపుగా సిద్ధమయ్యాయి. గత ఏడాది శిక్షణ శిబిరాల్లో 200 మందికి పైగా పాల్గొన్నారు. 9 నుంచి 16 ఏళ్ల వయస్సు పిల్లలకు మాత్రమే శిక్షణ ఇస్తారు.

కేపీహెచ్‌బీ కాలనీలో...

ప్రతి యేటా కేపీహెచ్‌బీ కాలనీలోని 7 ఫేజ్‌లో బాస్కెట్‌బాల్ మైదానం, క్రికెట్ మైదానంలో వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తారు. ఇక్కడ బాస్కెట్ బాల్‌తో పాటు టెన్నిస్, వాలీబాల్, షటిల్ కోర్టులు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేకంగా క్రికెట్ క్రీడా మైదానం అందుబాటులో ఉండటంతో శిక్షణ పొందేందుకు పెద్ద ఎత్తున చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు.


రమ్యా గ్రౌండ్స్‌లో..

మూడవ ఫేజ్ రమ్యా మైదానం క్రీడలకు అడ్డాగా మారింది. ఇక్కడి రెండు వేర్వేరు మైదానాల్లో బాడ్మింటన్, షటిల్, వాలీబాల్ క్రీడలకు శిక్షణ ఇస్తారు. ఫేజ్ వన్ అండ్ టూ లోని పార్కులో వాలీబాల్ గ్రౌండ్, ధన లక్ష్మి గ్రౌండ్‌లో వాలీబాల్, భువన విజయం గ్రౌండ్‌లో క్రికెట్, టెన్నిస్, వాలీబాల్ తదితర క్రీడలకు సంబంధించిన శిక్షణ అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. వీటితో పాటుగా కేపీహెచ్‌బీలోని ఇండోర్ స్టేడియంలో షటిల్ శిక్షణ ఇవ్వనున్నారు.

వచ్చే నెలలో ప్రారంభం

ఏప్రిల్ మొదటి వారంలో వేసవి శిక్షణా తరగతులకు ఆన్‌లైన్ ద్వారా పేర్ల నమోదుకు అవకాశం కల్పించనున్నారు. అనంతరం 20వ తేదీ తరువాత శిబిరాలను మైదానాల వారీగా ఎంపిక చేసి అందుకు తగ్గ క్రీడా పరికరాలను సమకూర్చనున్నారు. ఇప్పటికే కూకట్‌పల్లి జోన్ పరిధిలోని క్రీడా మైదానాల వారీగా అవసరమయ్యే క్రీడా పరికరాల వివరాలను అధికారులు సేకరించారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8.15 వరకు క్రీడలకు సంబంధించి ఆయా కోచ్‌ల ద్వారా శిక్షణ అందించనున్నారు. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ నామినల్ ఫీజు రూపంలో డబ్బులు వసూలు చేస్తారు. క్రికెట్ శిక్షణకు రూ.50, ఇతర క్రీడలకు రూ.10 చొప్పున తీసుకోనున్నట్లు కూకట్‌పల్లి జోన్ క్రీడల విభాగం అధికారి వీరానంద్ 'సాక్షి'కి తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి



జీహెచ్‌ఎంసీ వేసవి శిక్షణా శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ శిక్షణతో క్రీడా స్ఫూర్తి మరింత పెరుగుతుంది. ఆరోగ్య సంరక్షణ, మానసిక ఉల్లాసం, క్రమ శిక్షణ అలవాటు అవుతుంది. తల్లిదండ్రులు పిల్లలను వేసవి సెలవుల్లో క్రీడా శిబిరాలలో భాగస్వాములను చేయాలి. ప్రస్తుతం పిల్లలు పెడదోవ పట్టకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి.
– అంజిబాబు, బాస్కెట్‌బాల్ కోచ్